సాక్షి
సూర్యాపేట
ఆదివారం । 19 । మార్చి । 2023



అలరించిన నాటక పోటీలు
మిర్యాలగూడలో కొనసాగుతున్న జాతీయ స్థాయి నాటకపోటీలు తొమ్మిదో రోజూ అలరించాయి.
- 10లో



నృసింహుడికి లక్షపుష్పార్చన
ఏకాదశి సందర్భంగా శనివారం యాదాద్రీశుడికి లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు.
- 10లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 30°/20°
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

31న సూర్యాపేట బార్ అసోసియేషన్ ఎన్నికలు

చివ్వెంల(సూర్యాపేట) : సూర్యాపేట బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 31న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి గూడూరు శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 నుంచి 24 వరకు నామినేషన్ల స్వీకరణ, 25న స్క్రూటినీ, 27 న నామినేషన్ల ఉపసంహరణ, 31 న ఎన్నికలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఎన్నికల రోజే సాయంత్రం ఫలితాలు వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో ఇంటర్ పరీక్షల కేంద్రాన్ని డీఐఈఓ జె. కృష్ణయ్య తనిఖీ చేశారు. శనివారం ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించారు. పట్టణంలో రెండు చోట్ల పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 283 మంది విద్యార్థులకు 270మంది హాజరు కాగా ప్రియదర్శిని కాలేజీలో 193 మంది విద్యార్థులకు 190 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాధ్యులను శిక్షించాలి

సూర్యాపేటటౌన్ : టీఎస్ పీఎస్సీ పేపర్ లీకేజీకి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా ప్రజా సంఘాల ఐక్య వేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం సాయంత్రం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందార్భంగా డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య మాట్లాడుతూ విశ్వసనీయత కలిగి ఉండాల్సిన సంస్థలు దానిని కోల్పోవడం సరికాదన్నారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ సెంటర్‌లలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం భరోసా కల్పించలేకపోయిందని చెప్పారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు జి.వెంకటయ్య, చల్లా వెంకటేశ్వర్లు, బి.విరావు, చర్లపల్లి వెంకటయ్య, రాంబాబు, సుధాకర్, కృష్ణయ్య, నర్సయ్య, వెంకట్, నాగేందర్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీ దోషులను అరెస్ట్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రాల లీకేజీ దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని, సిట్టింగ్ జడ్జిచే విచారణ చేపట్టి కుట్రకు కారణమైన వారిని గుర్తించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షలాది మంది నిరుద్యోగ యువత ఆశలను నీరుగారుస్తూ లీకేజీలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. సీఎం కేసీఆర్‌కు నిరుద్యోగుల ఉసురు తలుగుతుందన్నారు. సుమారు 8 సంవత్సరాల తరువాత ఒక్క గ్రూప్- 1 పరీక్ష నిర్వహించి, దానిని రద్దు చేసి నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుతోందన్నారు. పేపర్ లీకేజీ ఘటనలో నిరుద్యోగులకు రూ.లక్ష పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పరీక్ష పత్రాల లీకేజీ ఘటనకు బాధ్యత వహించి మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి రాజీనామా చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ శ్రీదేవికి వినతిపత్రం అందించారు. ఈ కార్యాక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేంద్ర, మల్లెపాక సాయిబాబా, అసెంబ్లీ కన్వీనర్లు కర్నాటి కిషన్, కాపా రవి కుమార్, కనగల నారాయణ, పట్టణ అధ్యక్షుడు ఆబిద్, జిల్లా నాయకులు తుక్కని మన్మథరెడ్డి, చలమల నర్సింహ, పల్స మల్సూర్, కట్కూరి కార్తీక్, పగిళ్ల సుశీందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు పాల్గొన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని శనివారం అర్చకులు విశేషంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రత్యేకార్చనలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రక్తికట్టించారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేదమంత్రోచ్చరణలతో కల్యాణతంతు ముగించారు. కార్యక్రమంలో విజయ్ కుమార్, నవీన్, లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి , ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

గర్భిణులకు భరోసా.. టీఫా

సూర్యాపేట జీజీహెచ్‌లో అందుబాటులోకి ఆధునిక యంత్రం
- గర్భంలోని శిశువు అవయవ లోపాల గుర్తింపు సులువు
- ఇప్పటి వరకు 321మంది గర్భిణులకు స్కానింగ్
- పేదలకు తప్పిన ఆర్థిక భారం



జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని టీఫా స్కానింగ్ యంత్రం

హుజూర్‌నగర్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో టీఫా (టార్గెటెడ్ ఇమేజింగ్ ఫర్ ఫెటల్ ఎనామలీస్) స్కానింగ్‌కు ఆదరణ లభిస్తోంది. పేద, మధ్య తరగతికి చెందిన గర్భిణులకు ఈ ఆధునిక యంత్రం ఎంతో భరోసా కల్పిస్తోంది. దీని కోసం గర్భిణులు ఆస్పత్రికి క్యూ కడుతున్నారు. మూడు నెలల కాలంలో 321 మంది స్కానింగ్ చేయించుకున్నారు.

స్కానింగ్ చేయించుకున్న గర్భిణుల సంఖ్య

డిసెంబర్	జనవరి
60	110
ఫిబ్రవరి	మార్చి
97	54

ప్రతినెలా వంద మంది చొప్పున..
జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గత ఏడాది డిసెంబర్‌లో టీఫా స్కానింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతి నెలా సుమారు వంద మంది గర్భిణులకు వైద్య నిపుణులు స్కానింగ్ చేస్తున్నారు. దీంతో పేదలకు ప్రైవేట్‌కు వెళ్లే బాధ తప్పినట్లయింది. మరికొందరికి డాప్లర్ స్కానింగ్ కూడా చేస్తున్నారు. గర్భం దాల్చిన 18 వారాల నుంచి 24 వారాల మధ్య తప్పనిసరిగా టీఫా స్కానింగ్ చేయించాల్సి ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

లోపాలు గుర్తించే అవకాశం..
టీఫా స్కానింగ్ రాకముందు గతంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో రొటీన్ ప్రెగ్నెన్సీ పరీక్షలు మాత్రమే చేసేవారు. స్కానింగ్‌లో లోపాలు గుర్తించే అవకాశం తక్కువ ఉండేది. టీఫా స్కానింగ్ కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే ఒక్కో పరీక్షకు రూ.2 వేల వరకు ఫీజు తీసుకునే వారు. దీంతో పేదలపై ఆర్థిక భారం పడేది. కొందరికి ఈ పరీక్ష చేయించుకునే స్థోమత లేక అవయవ లోపాల పిల్లలకు జన్మనిచ్చేవారు. ఈనేపథ్యంలో సర్కారు దవాఖానాల్లో టీఫా స్కానింగ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

మండల వైద్యాధికారి సిఫార్సుతో స్కానింగ్‌కు రావాలి



టీఫా స్కానింగ్‌తో గర్భంలోని పిండం, అవయవాల ఎదుగుదల, లోపాలను గుర్తించవచ్చు. గతంలో అయితే రొటీన్ ప్రెగ్నెన్సీ పరీక్షలు మాత్రమే చేసేవారు. ఇప్పుడు టీఫా స్కానింగ్ అందుబాటులోకి రావడంతో అవయవాల లోపాలను గురించి తగిన జాగ్రత్తలు చెబుతున్నాం. జిల్లా కేంద్రానికి టీఫా స్కానింగ్ కోసం వచ్చే గర్భిణులు సంబంధిత మండల వైద్యాధికారి సిఫారసుతో ఆశ వర్కర్ సహాయంతో రావాలి.
– డాక్టర్ మురళీధర్‌రెడ్డి, సూపరింటెండెంట్, జీజీహెచ్, సూర్యాపేట

స్కానింగ్‌లో తెలిసే విషయాలు..
టీఫా స్కానింగ్ వల్ల గర్భంలో ఉన్న శిశువు కాళ్లు, చేతులు, ముఖం, చెవులు, ముక్కు, నోరు, ఛాతీ, కడుపు, వెన్నుపూస, మెదడులో లోపాలను గుర్తించవచ్చు. గుండె సరిగా కొట్టుకుంటుందా, రంధ్రాలు ఏమైనా ఉన్నాయా, ఊపిరితిత్తులు సరిగ్గా ఉన్నాయా లేదా ఇలా అనేక విషయాలను తెలుసుకునే వీలు కలుగుతుంది. మేనరికం వివాహాలు, జన్యులోపాలు, మానసిక సమస్యలు ఉన్న వారిని పరిగణనలోకి తీసుకుని ఈ స్కానింగ్ చేస్తారు. తగిన చికిత్సతో ఆయా లోపాలను నివారించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

● గాలి వాన.. వడగండ్లు



తుంగతుర్తి మండలం రావులపల్లిలో పడిన వడగండ్లు

సెర్ప్ ఉద్యోగులకు ఊరట

- ఏప్రిల్ 1 నుంచి పేస్కేల్ అమలుకు ప్రభుత్వ నిర్ణయం
- జీఓ విడుదల చేసిన సర్కారు
- జిల్లాలో 79 మందికి ప్రయోజనం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు



కలెక్టరేట్‌లో సమావేశంలో పాల్గొన్న సెర్ప్ ఉద్యోగులు (ఫైల్)

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)ఉద్యోగులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. గ్రామీణ ప్రాంతాల్లో వారి సేవలను గుర్తించిన ప్రభుత్వం పేస్కేల్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జీఓ ఎంఎస్ నంబర్11ను విడుదల చేసింది. ఏప్రిల్ 1 నుంచి పేస్కేల్ అమలులోకి రానుంది. మహిళా సంఘాలు ఏర్పాటు చేయడం, పొదుపు పాటించేలా చేయడం, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, కుటీర పరిశ్రమలు నెలకొల్పడం, ఆర్థిక అసమానతలను తొలగించడం వంటి కార్యక్రమాల్లో సెర్ప్ ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇకపై వీరు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించబడుతారు.

ఎట్టకేలకు..
2001లో అప్పటి ప్రభుత్వం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థను ఏర్పాటు చేసింది. అందులో పనిచేసే వారిని సెర్ప్ ఉద్యోగులుగా ప్రకటించింది. వీరికి ప్రభుత్వం కేడర్‌ను బట్టి కొంత గౌరవ వేతనాన్ని ఇస్తోంది. ప్రతి ఐదేళ్లకు ఒక సారి రెన్యువల్ చేస్తూ వచ్చింది. అయితే ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా తమకు ఉద్యోగ భద్రత, పే స్కేలు, హెచ్ఆర్‌పీ, డీఏలను అమలు చేయాలని కోరారు. ఎట్టకేటలకు వారి సమస్యలను ప్రభుత్వం గుర్తించింది. ఏప్రిల్ నుంచి పేస్కేల్ అమలుకు నిర్ణయించి జీఓ విడదల చేసింది. దీంతో జిల్లాలో 79 మంది సెర్ప్ ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది.

ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా..
ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా సెర్ప్ ఉద్యోగులను గుర్తించాలని ఎన్నోసార్లు గత ప్రభుత్వాలకు విన్నవించారు. వారికి గౌరవ వేతనం ఇస్తున్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులకు పెరిగినట్లు వేతనాలు పెరిగేవి కావు. ఇప్పుడు పే స్కేల్ అమలైతే ప్రభుత్వ నిబంధనల మేరకు ఉద్యోగులకు ఎప్పుడు వేతనాలు పెరిగినా వారికి పెరుగుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగులకు డీఏ, ఇతర అలవెన్సులు కూడా వచ్చే అవకాశం ఉంటుంది. ఇక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఉద్యోగులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయం సంతోషకరం



సెర్ప్ ఉద్యోగులకు ప్రభుత్వం పే స్కేల్‌ను ఏప్రిల్ నుంచి అమలు చేసేందుకు జీఓ విడుదల చేయడం చాలా సంతోషం. 2001 నుంచి చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కోసం అంకితభావంతో పని చేస్తున్న మా సేవలను గుర్తించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షదాయకం. ప్రభుత్వానికి రుణపడిఉంటాము.
– మిట్టగడుపుల కర్ణాకర్, సెర్ప్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగుల వివరాలు..

కేటగిరీ	ఉద్యోగులు	ప్రస్తుత కేడర్	పేస్కేల్
ప్రాజెక్టు మేనేజర్	-	ఎంపీడీఓ	51,320-1,27,310
డీపీఎంలు	04	సూపరిండెండెంట్	42,300-1,15,270
ఏపీఎంలు	29	సీనియర్‌అసిస్టెంట్	32,810-96,890
సీసీలు	39	జూ.అసిస్టెంట్	24,280-72,850
అడ్మిన్ అసిస్టెంట్	04	జూ.అసిస్టెంట్	24,280-72,850
ఎంఎస్‌సీసీలు	03	సబార్డినేట్	19,000-58,850

నెలాఖరు వరకు పెండింగ్ సీఎంఆర్ చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

- కలెక్టర్ ఎస్.వెంకట్రావు

దురాజ్‌పల్లి(సూర్యాపేట): గత సీజన్‌లలో సీఎంఆర్ పెండింగ్ ఉన్న మిల్లులు ఈ నెల చివరి నాటికి చెల్లించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో మిల్లర్ల, ఐకేపీ, మెప్మా, పీఏసీఎస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. 2020–21 రబీ సీజన్ నుంచి జిల్లాలో కొన్ని మిల్లులు సీఎంఆర్ బకాయి ఉన్నాయని, ప్రభుత్వం సీఎంఆర్ చెల్లింపునకు మరో 15 రోజులు గడువు ఇచ్చినట్లు తెలిపారు. సీఎంఆర్ బకాయి ఉన్న మిల్లులకు రానున్న రబీ సీజన్‌లో ధాన్యం ఇచ్చే ప్రసక్తి లేదని, ఆ మిల్లలను బ్లాక్‌లిస్టులో పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.మోహన్ రావు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి సోమ నర్సయ్య, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ బి. రాంపతి, డీసీఓ శ్రీధర్, డీఏఓ రామారావు నాయక్ పాల్గొన్నారు.

నాణ్యత పాటించకపోతే చర్యలు
అనంతగిరి: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకట్రావు హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని కొత్తగూడెం–గోండ్రియాల నూతన రహదారి పనులతో పాటు కొత్తగూడెంలో డ్రెయినేజీ నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రహదారి వెంబడి చెత్త కుప్పలను తొలగించాలని సిబ్బందిని అదేశించారు. ఆయన వెంట ఆర్డీఓ కిషోర్, తహసీల్దార్ సంతోష్ కిరణ్, ఎంపీడీఓ విజయ, పీఆర్ ఏఈ హర్ష ఉన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి
కోదాడరూరల్ : గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకట్రావు సూచించారు. శనివారం మండల పరిధిలోని చిమిర్యాల గ్రామాన్ని ఆకస్మికంగా తనిఖీచేసి మాట్లాడారు. రోడ్డు వెంట ఉన్న పెంటకుప్పలను తొలగించాలని ఆదేశించారు. వ్యాక్సినేషన్ సెంటర్‌ను పరిశీలించి అక్కడ ఉన్న చెత్తాచెదాలని తొలగించాలన్నారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించి మన ఊరు మనబడి పనులను, మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులను ఆంగ్లంలో జంతువుల స్పెల్లింగ్ అడగగా వారు సరైన సమాధానం చెప్పకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆర్డీఓ లక్కినేని కిషోర్‌కుమార్, సర్పంచ్ కొండా శైలజ తదితరులు ఉన్నారు.

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
మునగాల(కోదాడ): విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తప్పవని కలెక్టర్ ఎస్.వెంకట్రావు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనుల్లో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వచ్చే వేసవిలో ప్రతి గ్రామంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ ఎల్.కిశోర్‌కుమార్, మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ జవహర్, ఎంపీడీఓ బి.వెంకటేశ్వర్లు, ఎంపీఓ భూపాల్‌రెడ్డి, ఆర్ఐ రాధారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి : మంత్రి



సద్దల చెరువు వద్ద పనులను పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మున్సిపల్ కమిషనర్

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని సద్దల చెరువు వద్ద చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆదేశించారు. సద్దల చెరువు కట్ట స్లోప్‌పై పచ్చదనం పెంపు, సమీపంలోని మహాప్రస్థానం, ఇతర అభివృద్ధి పనులను ఆయన మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలన్నారు.

అన్నివర్గాలను మోసం చేస్తున్న సీఎం కేసీఆర్

పెన్‌పహాడ్: పోరాడి సాధించుకున్న తెలంగాణలో అన్నివర్గాల ప్రజలను సీఎం కేసీఆర్ మోసం చేస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి ఆరోపించారు. శనివారం మండలంలోని భాగ్యతండా, రంగయ్యగూడెం, భక్తాళాపురం గ్రామాల్లో కొనసాగిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు గద్దల నాగరాజు, కొండేటి పవన్, బచ్చుపల్లి నాగేశ్వర్ రావు, షఫీఉల్లా, యాట ఉపేందర్, కుందూరు వెంకట్‌రెడ్డి, బెల్లంకొండ శ్రీరాములు, మండలి పిచ్చయ్య, చింతం వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, చొక్కయ్యగౌడ్, వల్దాసు దేవేందర్, స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వినయ్.. అమర్ రహే..

- మల్కాజ్‌గిరి నుంచి బొమ్మలరామారం వరకు అంతిమయాత్ర
- జాతీయపతాకాలు, వినయ్ చిత్రపటంతో యువత బైక్ ర్యాలీ
- వ్యవసాయక్షేత్రంలో ముగిసిన అంత్యక్రియలు
- పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులు

అశ్రునయనాలతో వినయ్ భానురెడ్డికి అంతిమ వీడ్కోలు



లెఫ్టినెంట్ కల్నల్ వినయ్‌భానురెడ్డి పార్థివదేహాన్ని బొమ్మలరామారం తీసుకొస్తున్న గ్రామస్తులు

బొమ్మలరామారం : అరుణాచల్‌ప్రదేశ్‌లో ఈ నెల 16న చీతా హెలికాప్టర్ కూలిన ప్రమాదంలో అశువులు బాసిన లెఫ్టినెంట్ కల్నల్ ఉప్పల వినయ్‌భానురెడ్డి అంత్యక్రియలు శనివారం బొమ్మలరామారం మండల కేంద్రంలో జరిగాయి. ఉదయం హైదరాబాద్‌లోని మల్కాజిగిరి నుంచి వినయ్ భౌతికకాయాన్ని ఆర్మీ అధికారులు ప్రత్యేక సైనిక వాహనంలో బొమ్మలరామారానికి తీసుకువచ్చారు. అంతిమయాత్ర ఉద్విగ్నంగా సాగింది. వినయ్ భౌతికకాయం ఉన్న వాహనం ఉదయం 11.35 గంటలకు బొమ్మలరామారం మండలంలోని రంగాపూర్ చెక్‌పోస్ట్ వద్దకు చేరుకుంది. వినయ్‌భానురెడ్డి పార్థివదేహానికి పూలు చల్లుతూ యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్‌లపై జాతీయ జెండాలు, వినయ్ భానురెడ్డి చిత్రం పటంతో ఉన్న ఫ్లెక్సీలను ప్రదర్శించారు. వినయ్ భానురెడ్డి అమర్ రహే.. అంటూ నినాదాలు చేస్తూ ముందుకుసాగారు. సైనిక వాహనం రంగాపూర్ గ్రామం మీదుగా మండల కేంద్రంలోని గుడిబావి చౌరస్తా నుంచి 12.23 గంటలకు గ్రామంలోని వినయ్ భానురెడ్డి స్వగృహానికి వచ్చింది. సైనిక అధికారులు వినయ్ పార్థీవదేహం పేటికను ఆయన స్వగృహానికి మోసుకు వచ్చారు. అక్కడ సుమారు అరగంటపాటు గ్రామస్తుల సందర్శనార్థం ఉంచారు. బంధువులు, ప్రజలు భారీగా వచ్చి నివాళులర్పించారు. అక్కడి నుంచి తిరిగి 12.58 గంటలకు సైనిక సంప్రదాయ బ్యాండ్‌తో అంతిమ యాత్ర ప్రారంభించారు. అంతిమయాత్రలో మంత్రి జగదీష్‌రెడ్డితో పాటు ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్‌డీవో భూపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, రాచకొండ సీపీ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు. 1.41 గంటలకు అంతిమయాత్ర వ్యవసాయ క్షేత్రానికి చేరుకుంది. వినయ్ భానురెడ్డి భౌతికకాయం పేటికపై ఉంచిన జాతీయ జెండాను, ఆయన సైనిక దుస్తులను ఆర్మీ అధికారులు వినయ్ భార్య స్పందనారెడ్డికి అందజేశారు. సైనిక లాంఛనాల ప్రకారం మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపాక మధ్యాహ్నం 2.10 గంటలకు హిందూ సంప్రదాయం ప్రకారం వినయ్‌భానురెడ్డి పెద్ద కూతురు అనికతో తండ్రి నర్సింహారెడ్డి వినయ్ చితికి నిప్పంటించి అంత్యక్రియలను పూర్తి చేశారు.



అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న వినయ్ తండ్రి నర్సింహారెడ్డి



సంతాప సూచకంగా గాల్లోకి కాల్పులు జరుపుతున్న ఆర్మీ జవాన్లు

చిన్నారులను చూసి కంటతడి పెట్టిన గ్రామస్తులు

వినయ్ భానురెడ్డి అంత్యక్రియలలో ఆయన కూతుళ్లు అనిక, ఆర్నిక బిక్కచూపులు చూస్తుంటే అక్కడున్నవారు కంటతడిపెట్టారు. వేల మందిలో మా నాన్న ఎక్కడ ఉన్నాడు అని వెతుకుతూ తల్లి స్పందనారెడ్డిని అడుగుతున్నట్లుగా ఆ చిన్నారుల అమాయక చూపులు పలువురిని కంటతడిపెట్టించాయి. చిన్న కుమార్తె ఆర్నిక వినయ్ భానురెడ్డి పార్థివదేహం గల పేటిక వద్దకు వెళ్లి నాన్న లే అన్నట్లుగా పేటికను తట్టినప్పుడు మహిళలు రోదించారు. అనిక తన తాత నర్సింహారెడ్డితో కలిసి తండ్రి చితికి నిప్పుపెడుతుండగా ఆ దృశ్యాన్ని చూసి పలువురు అధికారులు సైతం కంటతడిపెట్టారు. వినయ్ భానురెడ్డి భార్య స్పందనారెడ్డి హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి నుంచి బయలుదేరినప్పటి నుంచి స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తయ్యే వరకు తన భర్త వినయ్ భానురెడ్డి చిత్ర పటాన్ని తన వెన్నంటే పెట్టుకొని మౌనంగా రోదించించారు.



వినయ్ పార్థివదేహం పేటికపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



వినయ్ సైనిక దుస్తులను ఆయన భార్యకు అందజేస్తున్న ఆర్మీ అధికారులు

క్లుప్తంగా

చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంతోష్‌రెడ్డి

సూర్యాపేట: పన్నెండు సంవత్సరాలుగా ప్రభుత్వ ఉద్యోగానికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటూ వేతనం తీసుకుంటున్న వ్యక్తి సమాచారం అడిగితే తప్పుడు సమాచారం ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు న్యాయ రక్షణ చట్టం 2005 తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కూనపరెడ్డి సంతోష్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమాచార హక్కు న్యాయ రక్షణ చట్టం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి మిషన్ భగీరథ ఇంట్రాలో సూర్యాపేటలో విధులు నిర్వహిస్తున్నాడన్నారు. సదరు వ్యక్తి సమాచారం ఇవ్వాల్సిందిగా మిషన్ భగీరథ ఇన్నా ఈఈని కోరగా తప్పుడు సమాచారం ఇచ్చినట్లు ఆరోపించారు. ఈ విషయమై హైకోర్టులో పిటిషన్ దాఖలు వేశామని తెలిపారు. సమావేశంలో మస్తాన్‌వలీ, రాపర్తి సురేష్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

పత్రాలు లేకుండా వాహనాలు నడపొద్దు

కోదాడరూరల్ : వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనం నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి ప్రజలకు సూచించారు. శనివారం తెల్లవారుజామున పట్టణంలోని అంబేడ్కర్ కాలనీతో పాటు రాష్ట్ర సరిహద్దు అయిన రామాపురం క్రాస్‌రోడ్ వద్ద జాతీయ రహదారిపై కార్డెన్‌సర్చ్ నిర్వహించి మాట్లాడారు. అక్రమ వ్యాపారాలకు వాహనాలను ఉపయోగించవద్దని హెచ్చరించారు. రామాపురం క్రాస్‌రోడ్‌లో అనుమతులు లేకుండా లేగదూడలను, నల్లబెల్లాన్ని తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 55 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో డీఎస్పీతో పాటు ముగ్గురు సీఐలు, 13మంది ఎస్‌ఐలు, 65 మంది కానిస్టేబుళ్లు, 17 మంది స్పెషల్ పార్టీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

గాలివాన, వడగండ్లు

పలు మండలాల్లో భారీ వర్షం

- రోడ్లపై కూలిన చెట్లు, విరిగిన స్తంభాలు
- స్తంభించిన ట్రాఫిక్
- నిలిచిన విద్యుత్ సరఫరా

భువనగిరి, యాదగిరిగుట్ట, భూదాన్‌పోచంపల్లి, ఆత్మకూర్(ఎం), వలిగొండ : జిల్లాలోని పలు మండలాల్లో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులు, వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. భువనగిరి పట్టణంతో మండలంలో సుమారు 20 నిమిషాల పాటు వడగండ్ల వాన పడింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోకి వర్షపు నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ప్రధాన రోడ్లు జలమయం అయ్యాయి, డ్రెయినేజీలు పొంగిపొర్లాయి.

భూదాన్‌పోచంపల్లిలో..

మండల వ్యాప్తంగా మోస్తరు వర్షం కురిసింది. జలాల్‌పురంలో తేలికపాటి వడగండ్లు పడ్డాయి. ఉదయం నుంచి ఆకాశం మబ్బులు కమ్ముకోవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

తిరుమలగిరిలో..



తిరుమలగిరిలో కురిసిన వడగండ్లు

తిరుమలగిరి: తిరుమలగిరి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం రాత్రి రాత్రి 7 గంటల నుంచి 8గంటల వరకు వడగండ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక్కసారిగా భారీ ఈదురు గాలులతో కూడిన 100 గ్రాముల బరువు గల వడగండ్లు పడడంతో ప్రజలంతా భయభ్రాంతులకు గురయ్యారు. పెంకుటిళ్లలన్నీ దెబ్బతిన్నాయి. భారీ ఈదురు గాలులకు తిరుమలగిరి–తొర్రూర్ రోడ్డుపై భారీ వృక్షాలు నేలకూలాయి. తొర్రూర్ రోడ్డు వైపు ఉన్న ఒక దాబా వద్ద కారుపై భారీ వృక్షం కూలింది. ఇదే రోడ్డులో తొండ గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభాలు, చెట్లు రోడ్లపై పడ్డాయి. తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని నెల్లిబండతండాలో గోడ కూలి 20 గొర్రెలు మృతి చెందాయి. జనగాం –సూర్యాపేట ప్రధాన రహదారిపై హోర్డింగ్ కూలడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. అధికారులు వచ్చి జేబీసీల సహాయంతో తొలగించారు.



ఆత్మకూర్ (ఎం)లో కురిసిన వడగండ్లు

యాదగిరిగుట్టలో..

పట్టణంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది, రోడ్లపై వర్షపు నీరు పొంగిపొర్లింది. ఒక్కసారిగా వర్షం రావడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అదే విధంగా మోటకొండూరు, ఆత్మకూర్(ఎం) మండలాల్లోనూ వడగండ్లు పడ్డాయి. నష్టం వివరాలు ఆదివారం తెలియనున్నాయి.

మోత్కూరు: మోత్కూరు మున్సిపల్ కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వానతో రైతాంగానికి తీవ్ర నష్టాన్ని కలిగించింది. పొట్ట దశకు చేరుకున్న వరి చేలపై వడగండ్లు కురవడంతో వడ్లు రాలిపోయి నష్టం కలిగిందని రైతులు వాపోతున్నారు.

తుంగతుర్తి: మండల పరిధిలోని రావులపల్లి, మానాపురం, గొట్టిపర్తి గ్రామాల్లో శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వడగండ్ల వర్షం కురిసింది. వరిచేలు, మామిడి తోటలు దెబ్బతిన్నాయి. సుమారు 150 గ్రాముల బరువుతో వడగండ్లు పడటంతో పెంకుటిళ్లల పైకప్పులు పగిలిపోయాయి. రావులపల్లిలో రోడ్లు మంచుకప్పినట్లుగా కనిపించాయి. తుంగతుర్తి–రావుపల్లి రహదారిపై చెట్టు విరిగి పడటంతో ప్రయాణికుల రాకపోకలకు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కూలిన భారీ కటౌట్లు

మేళ్లచెరువు: మండలకేంద్రంలో గతనెల మహా శివ రాత్రి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ కటౌట్‌లు శనివారం సాయంత్రం వచ్చిన గాలివానకు మెయిన్ రోడ్డు పక్కన కూలి పడిపోయాయి. దీంతో దగ్గరలో పార్కింగ్ చేసిన రెండు బైక్‌లు, ఓ కారు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

నేలవాలిన వరిపైర్లు

హుజూర్‌నగర్ రూరల్: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు గోపాలపురం, బూరుగడ్డ, కరక్కాయలగూడెం గ్రామాల్లో కోత దశకు చేరుకున్న వరిచేలు నెలవాలాయి.

వలిగొండలో..

మండలంలోని పులిగిల్ల, మొగిలిపాక, పహిల్వాన్‌పురం, రెడ్లరేపాకలో ఈదురుగాలు, వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. రెడ్లరేపాకలో ఈదురు గాలులకు చెట్టు కూలి మూడు బైక్‌లు ధ్వంసమయ్యాయి. ఇదే గ్రామంలో విద్యుత్ వైర్ తెగడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



రెడ్లరేపాకలో ఈదురుగాలులకు చెట్టుకూలి ధ్వంసమైన బైకులు

దెబ్బతిన్న నిమ్మతోటలు



కనగల్ : నేలరాలిన నిమ్మకాయలు

కనగల్: దర్వేశిపురం గ్రామపంచాయతీ పరిధిలోని మంచినీళ్లబావిలో శనివారం ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. దీంతో నిమ్మతోటల్లోని చెట్లు కూకటివేళ్లతో నేలమట్టమయ్యాయి. చాలామంది రైతుల తోటల్లో కాయలు నేలరాలాయి. తోటల్లో రైతులు వేసుకున్న రేకుల షెడ్లు, 10 కరెంట్ స్తంభాలు కూలాయి. వరిచేలు నేలవాలాయి. ఇటుక బట్టీలు నేలకు ఒరిగాయి. మా గ్రామంలోనే ప్రకృతి కన్నెర్రజేసిందని రైతులు వాపోతున్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని గర్కనటేతండాలో శనివారం సాయంత్రం కురిసిన గాలివాన బీభత్సానికి సఫావత్ మోతీలాల్, సఫావత్ కమలి, బాలోజీల ఇళ్ల పైకప్పు రేకులు లేచిపోయి పూర్తిగా ధ్వంసమయ్యాయి. తమ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

లక్ష్మీనరసింహుడిని దర్శించుకున్న మంత్రి



లక్ష పుష్పార్చనలో పాల్గొన్న సినీనటుడు తనికెళ్ల భరణి, కుటుంబ సభ్యులు



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, సినీనటుడు తనికెళ్ల భరణి, బిగ్‌బాస్–6 రన్నరప్ శ్రీహాన్ తమ కుటుంబ సభ్యులతో కలిసి వేర్వేరుగా దర్శించుకున్నారు. గర్భాలయంలో పూజలు చేశారు. ఏకాదశి కావడంతో ముఖ మండపంలో నిర్వహించిన లక్ష పుష్పార్చన పూజల్లో సైతం పాల్గొన్నారు. మంత్రికి ప్రభుత్వ విప్ గొంగిడి సునీత ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, రైతుబంధు జిల్లా డైరెక్టర్ మిట్ట వెంకటయ్యగౌడ్ స్వాగతం పలికారు.



శ్రీస్వామిని దర్శించుకున్న బిగ్ బాస్–6 రన్నరప్ శ్రీహాన్ తదితరులు

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

చివ్వెంల(సూర్యాపేట): విద్యుదాఘాతానికి గురైన విద్యార్థి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని కుడకుడ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాల మండలం గోరంట్ల గ్రామానికి చెందిన గిలకత్తుల పూర్ణచందర్, మంజుల తమ ఇద్దరు కుమారుల చదువు నిమిత్తం సూర్యాపేటకు వచ్చి కుడకుడలోని స్నేహనగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరి చిన్న కుమారుడు అభిరామ్ (10) స్థానిక ప్రైవేట్ పాఠశాలలో 3 వతరగతి చదువుతున్నాడు. ప్రస్తుతం ఒంటిపూట బడులు కావడంతో శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చిన అభిరామ్ మేడపై ఉన్న టీవీ కేబుల్ వైరుతో ఆడుకుంటుండగా ఆ వైరు ఇంటిపై నుంచి వెళ్తున్న 33 కేవీ విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే 70 శాతం కాలి ఉన్న అభిరామ్‌ను హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అంత్యక్రియలు నిమిత్తం బాలున్ని గోరంట్లకు తీసుకెళ్లారు.

పురుగుల మందు తాగిన యువకుడు..

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. చిట్యాల ఏఎస్ఐ జానారెడ్డి తెలిపిన వివరాలిలా.. వెలిమినేడు గ్రామానికి చెందిన బైకాని అశోక్ (25) గ్రామంలో చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం ఉదయం పూట మద్యం సేవించడంతో అతన్ని కుటుంబసభ్యులు మందలించారు. మనస్తాపానికి గురైన అశోక్ వెంటనే గ్రామ శివారుకు వెళ్లి తాను పురుగుల మందు తాగినట్లు అతని స్నేహితులు, కుటుంబసభ్యులకు వాట్సాప్ కాల్ చేశాడు. కుటుంబ సభ్యులు అతన్ని నార్కట్‌పల్లి కామినేని, అనంతరం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తల్లి మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

150 బస్తాల నల్లబెల్లం పట్టివేత

కోదాడ రూరల్ : ఏపీ రాష్ట్రం చిత్తూరు నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న ఏడున్నర టన్నుల నల్ల బెల్లం డీసీఎం వాహనాన్ని కోదాడ రూరల్ పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం తమిళనాడుకు చెందిన నల్లతంబి కందస్వామి తన సొంత డీసీఎంలో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీరంగరాజపురం మార్కెట్‌లో 150 బస్తాల నల్లబెల్లం, 10 కేజీల పటికను లోడ్ చేసుకున్నాడు. ఈ బెల్లాన్ని తెలంగాణ మీదగా మహారాష్ట్రలోని లాతూర్ మార్కెట్‌కు తరలిస్తున్నాడు. రాష్ట్ర సరిహద్దు అయిన కోదాడ మండలం రామాపురం క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. అదే విధంగా ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న 35 ఆవులను కూడా పట్టుకున్నారు. ఈ కేసుల్లో రెండు వాహనాలను సీజ్‌చేసి నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలి

గరిడేపల్లి: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం ఎంతో మేలని కేవీకే శాస్త్రవేత్తలు సీహెచ్ నరేష్, ఎ.కిరణ్ అన్నారు. ఢిల్లీలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముఖ్యఅతిథిగా నిర్వహించిన గ్లోబల్ మిల్లెట్స్ కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని శనివారం గడ్డిపల్లిలోని అరబిందో కృషి విజ్ఞాన కేంద్రంలో ఎంపీపీ పెండెం సుజాతశ్రీనివాస్ గౌడ్‌తో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రస్తుతం అధికంగా ఉపయోగిస్తున్న వరి, గోధుమ ఆరోగ్యానికి అంత మంచిది కాదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చిరుధాన్యాల ప్రాధాన్యత మరింత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు టి.మాధురి, డి.ఆదర్శ్, ఎన్.సుగంధి, కంప్యూటర్ ప్రొగ్రామర్ ఎ.నరేష్, 56 మంది రైతులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం

- మరో ముగ్గురికి గాయాలు
- మృతుల్లో ఒకరు నెల్లూరుకు చెందిన యువతి
- కేతేపల్లి, మర్రిగూడ, నాగారం మండలాల పరిధిలో ఘటనలు

ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో శుక్రవారం రాత్రి, శనివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతించగా మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటనలు కేతేపల్లి, మర్రిగూడ, నాగారం మండలాల పరిధిలో చోటు చేసుకున్నాయి.



కేతేపల్లి: హైవేపై పల్టీ కొట్టిన కారు



మృతి చెందిన సుంచు నర్సింహ, ముత్తయ్య

కేతేపల్లి: తెల్లవారితే ఆ యువతి అమెరికాకు పయనం కావాలి.. బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా ఆమెను మృత్యు వెంటాడింది. గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో కారు అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో యువతి మృతి చెందగా మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం కేతేపల్లి మండలం చీకటిగూడెం వద్ద 65 నంబర్ జాతీయ రహదారిపై శనివారం జరిగింది. పోలీసులు తెలిపన వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీ రాష్ట్రం నెల్లూరు జిల్లాకు చెందిన కరుణం ప్రీతి (21) తమ బంధువులతో కలిసి అమెరికాలో ఉంటూ విద్యనభ్యసిస్తోంది. ప్రీతి ఆమె బంధువులతో కలిసి ఇటీవలహైదరాబాద్‌కు వచ్చింది. విజయవాడలో తమ బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు ప్రీతి హైదరాబాద్ నుంచి బంధువులతో కలిసి ఈనెల 16న కారులో విజయవాడకు వెళ్లారు. నిర్ణీత తేది ప్రకారం ఆదివారం ఉదయం ప్రీతి హైదరాబాద్ నుంచి అమెరికాకు వెళ్లాల్సి ఉంది. దీంతో శనివారం కారులో హైదరాబాద్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో కేతేపల్లి మండల పరిదిలోని చీకటిగూడెం వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం ప్రీతి ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో కారు అదుపు తప్పి రోడ్డుపై పల్టీ కోట్టి అడ్డంగా పడింది. దీంతో హైవే ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. వాహనంలో ఉన్న వారిని బయటుకు తీశారు. క్రేన్ సహాయంతో కారును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ప్రీతి తలకు బలమైన దెబ్బలు తగిలి అక్కడిక్కడి మృతి చెందింది. కారులో ఉన్న ప్రీతి చిన్నమ్మ చేకూరి సరిత చేతికి బలమైన గాయాలయ్యా యి. మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడ్డవారిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రీతి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో మరొకరు

మర్రిగూడ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యరగండ్లపల్లికి చెందిన వల్లెంల ముత్తయ్య(50) తన భార్య ముత్తమ్మను తీసుకొని బైక్‌పై గ్రామం నుంచి మర్రిగూడకు వెళ్తున్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కొత్త శివ, ఎడ్ల రాజులు బైక్‌పై నిర్లక్ష్యంగా అతివేగంగా మర్రిగూడ నుంచి యరగండ్లపల్లికి వెళ్తుండగా పురేనాగుట్ట మూలమలుపు వద్ద ముత్తయ్య బైక్‌ను ఎదురుగా వచ్చి బలంగా ఢీకొనడంతో ముత్తయ్య, ముత్తమ్మ, శివలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మాల్ పీపుల్స్ ఆస్పత్రికి తరలించారు. ముత్త య్య పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతిచెందాడు. బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌రెడ్డి తెలిపారు.

బైక్ అదుపుతప్పి మరో వ్యక్తి..

నాగారం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఫణిగిరిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి చెందిన సుంచు నర్సింహ (32) వృత్తిరీత్యా లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వ్యక్తిగత పనిపై తన అత్తగారి ఊరైన తుంగతుర్తికి బైక్‌పై వెళుతుండగా మార్గమధ్యంలో ఫణిగిరి శివారులోని బంధం మైసమ్మ గుడి వద్ద బైక్ అదుపు తప్పడంతో పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొట్టాడు. ఈ ఘటనలో తలకు బలమైన గాయాలైన నర్సింహ అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఆరునెలల గర్భిణి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.